
సాక్షి
బాపట్ల
శనివారం । 29 । మార్చి । 2025



రేపు బాబా మందిర వార్షికోత్సవం

క్రోసూరు: స్థానిక షిర్డీ సాయిబాబా మందిరం 25వ వార్షికోత్సవం ఆదివారం జరుగుతుందని ఆలయ కమిటీ అధ్యక్షుడు మన్నెం వెంకట్రావు శుక్రవారం తెలిపారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటి మట్టం శుక్రవారం 521.60 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడికాలువకు 6,041 క్యూసెక్కులు విడుదలవుతోంది.

నగరోత్సవానికి వెండి రథం సిద్ధం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఉగాది నాడు ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గా మల్లేశ్వరస్వామి వార్లకు నిర్వహించే వెండి రథోత్సవానికి సర్వం సిద్ధమైంది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని వెండి రథానికి సిబ్బంది శుక్రవారం మెరుగులు దిద్దారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (శని)	సహర్ (ఆది)
బాపట్ల	6.25	4.48
గుంటూరు	6.25	4.48
నరసరావుపేట	6.27	4.50

న్యూస్‌రీల్

పర్యాటక రంగానికి వన్నె తెచ్చేలా వాటర్ పార్క్



బాపట్ల : పర్యాటక రంగానికి వన్నె తెచ్చేవిధంగా వి రిసార్ట్స్‌లో వాటర్ పార్క్ ఏర్పాటు చేశారని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. బాపట్లలోని వాడరేవులోని కొత్తగా ఏర్పాటు చేసిన వాటర్ పార్క్‌ను శుక్రవారం మంత్రి ప్రారంభించారు. మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ సూర్యలంకలో పర్యాటక కేంద్రం అభివృద్ధికి కేంద్రప్రభుత్వం నుంచి రూ.97కోట్లు మంజూరు చేసినట్లు చెప్పారు. కొత్తగా ఏర్పాటు చేస్తున్న పిడుగురాళ్ల నుంచి రామాయపట్నం రోడ్డును వై జంక్షన్‌గా పాండురంగాపురం రోడ్డుకు అనుసంధానం చేయాలని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మరాజు మంత్రిని కోరారు. చీరాల ప్రాంతం నుంచి సూర్యలంకను కలుపుతూ తీరం పక్కగా రోడ్డు నిర్మాణం చేపట్టాలని చీరాల ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య కోరారు. కార్యక్రమంలో వి రిసార్ట్స్ ఎండీ సందీప్, బావుడా చైర్మన్ సలగల రాజశేఖర్‌బాబు, జనసేన నాయకులు నామన శివన్నారాయణ, మార్కెట్ యార్డు చైర్మన్ కావూరి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మిర్చి యార్డుకు నేటి నుంచి వరుస సెలవులు

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం నుంచి వరుసగా మూడు రోజులు పాటు సెలవులు ప్రకటించారు. శని, ఆదివారాలు యార్డుకు సాధారణ సెలవులు, సోమవారం రంజాన్ పండగను పురస్కరించుకుని మిర్చి యార్డుకు మూడు రోజులపాటు సెలవులు ప్రకటించినట్టు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఎ.చంద్రిక శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు తమ సరుకును యార్డుకు తీసుకురావద్దని కోరారు. సోమవారం అర్ధరాత్రి నుంచి రైతుల సరుకును యార్డులోకి అనుమతిస్తామని పేర్కొన్నారు. మంగళవారం యధావిధిగా యార్డులో క్రయ విక్రయాలు కొనసాగుతాయని ఆమె వివరించారు.

శ్రీరామ పట్టాభిషేక అలంకారం



మంగళగిరి టౌన్ : మంగళాద్రిలోని శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆస్థాన అలంకారోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం స్వామి భక్తులకు శ్రీరామ పట్టాభిషేకం అలంకారంలో దర్శనమిచ్చారు. ఉత్సవ కైంకర్యపరులుగా గుంటూరుకు చెందిన కారుమంచి మురళీసాయి, సోదరులు, ఆస్థాన కైంకర్యపరులుగా మంగళగిరిపట్టణానికి చెందిన యేనుగ కిషోర్ కుటుంబ సభ్యులు వ్యవహరించారు. ఏర్పాట్లను ఆలయ ఈవో రామకోటిరెడ్డి పర్యవేక్షించారు.

ట్రాఫిక్ పోలీసులకు టోపీలు, కళ్లజోళ్లు



నగరంపాలెం(గుంటూరు వెస్ట్): ఈ వేసవిలో ఎండ తీవ్రత దృష్ట్యా ట్రాఫిక్ విధులు నిర్వర్తించే పోలీస్ అధికారులు, సిబ్బందికి టోపీలు, కళ్లజోళ్లు ఉపయోగపడతాయని ఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ట్రాఫిక్ సీఐలు, ఎస్ఐలు, సిబ్బందికి టోపీలు, కళ్లజోళ్లను అందించారు. గ్రేటర్ వాసవి క్లబ్ గుంటూరు తరపున సుమారు 200 టోపీలు, కళ్లజోళ్లను అందించిన సీహెచ్ శేఖర్, కొత్తూరు అశోక్, కొత్తూరు హేమంత్‌లను జిల్లా ఎస్పీ అభినందించి సత్కరించారు. కార్యక్రమంలో శిక్షణా ఐపీఎస్ అధికారిణి దీక్ష, ట్రాఫిక్ డీఎస్పీ రమేష్, సీఐలు ఎ.అశోక్‌కుమార్ (తూర్పు), సింగయ్య (పశ్చిమ), ఎస్ఐలు రవీంద్రబాబు, శ్రీహరి పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవటంలో
కూటమి ప్రభుత్వం విఫలం

- వైఎస్సార్ సీపీ హయాంలో పండగలా వ్యవసాయం
- కూటమి పాలనలో దగా పడుతున్న రైతాంగం
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ మేరుగ నాగార్జున



చెరుకుపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, మిర్చి రైతులు

రేపల్లె రూరల్: రైతులను ఆదుకోవటంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు డాక్టర్ మేరుగ నాగార్జున విమర్శించారు. పచ్చిమిర్చి రైతుకు మద్దతుగా వైఎస్సార్ సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ ఆధ్వర్యంలో శుక్రవారం బాపట్ల జిల్లా చెరుకుపల్లిలో నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ జాతీయ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన అనేక సంక్షేమ పథకాలను కూటమి ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేసిందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో వ్యవసాయం పండుగలా ఉంటే చంద్రబాబు రైతులను విస్మరించి వ్యవసాయం దండగ అనేలా పనిచేస్తున్నారన్నారు. పండిన పంటకు గిట్టుబాటు ధర లేక, చేసిన అప్పులు తీరే మార్గం లేక రైతులు బాధలు వెళ్లగక్కుతుంటే కళ్లలో నీళ్లు తిరుగుతున్నాయన్నారు. గత ఏడాది వరకు 10 కిలోల మిర్చి రూ.300 వరకు ఉండగా ప్రస్తుత కూటమి పాలనలో రూ.30లకు కొనేవారు లేరని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈ ధరల్లో వ్యత్యాసం రావటానికి, రైతులు తీవ్రంగా నష్టపోవటానికి కూటమి ప్రభుత్వం కారణం కాదా అని ప్రశ్నించారు. వైఎస్సార్ సీపీ పాలనలో క్వింటా ఎండు మిర్చి రూ.25వేల నుంచి రూ.27వేల వరకు డిమాండ్ ఉండగా నేడు రూ.10వేలకు సైతం కొనేవారు లేరన్నారు. ఎండు మిర్చి రైతులకు మద్దతుగా గుంటూరు మిర్చి యార్డులో జగన్‌మోహన్‌రెడ్డి తలపెట్టిన నిరసన కార్యక్రమంతో ప్రభుత్వం దిగి వచ్చి గిట్టుబాటు ధరపై కేంద్రానికి లేఖ రాసిందన్నారు. క్వింటా ఎండు మిర్చి రూ.11,870లకు కొనుగోలు చేస్తామని ఆగమేఘాలపై ప్రకటించిన ప్రభుత్వం నేటి వరకు ఒక కిలో కూడా ఎందుకు కొనుగోలు చేయలేదో రైతులకు సమాధానం చెప్పాలన్నారు.



తుమ్మలపాలెంలో రైతులతో మాట్లాడుతున్న మేరుగ నాగార్జున, డాక్టర్ గణేష్

న్యాయం జరిగే వరకు పోరాటాలు

వైఎస్సార్ సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ మాట్లాడుతూ వ్యవసాయాన్ని నిర్వీర్యం చేసే లక్ష్యంగా కూటమి పాలన సాగుతోందని ధ్వజమెత్తారు. రైతులకు గిట్టుబాటు ధర లభించి న్యాయం జరిగే వరకు పోరాటాలు చేస్తామని హెచ్చరించారు.

రైతులకు పరామర్శ

గుళ్లపల్లిలోని పార్టీ కార్యాలయం నుంచి తుమ్మలపాలెం గ్రామం వరకు ర్యాలీగా వెళ్లి మిర్చి పొలాలలో ఉన్న రైతులను పరామర్శించారు. వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి తహసీల్దార్ పద్మావతికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రైతు విభాగం బాపట్ల జిల్లా అధ్యక్షుడు ఈడ శ్రీనివాసరెడ్డి, రేపల్లె పట్టణ, మండలం, చెరుకుపల్లి మండలాల వైఎస్సార్ సీపీ కన్వీనర్‌లు కర్రెటి శేషగిరిరావు, మేడికొండ అనిల్, దుండి వెంకట రామిరెడ్డి, పార్టీ నాయకులు చిమటా బాలాజీ, చిత్రాల ఓబేదు, నిజాంపట్నం కోటేశ్వరరావు, కాశీ ప్రభాకర్, వీసం నాగలక్ష్మి, కాటూరి శివనాగబాబు, అప్పిరెడ్డి, సుబ్బిరామిరెడ్డి, తుమ్మా సాంబశివరెడ్డి, ప్రభుకిరణ్, కొండలురెడ్డి, రాజశేఖర్, సత్యనారాయణ, షేక్ అతిక్, శౌంరి సురేష్, రత్నాకర్, ఉమారాణి, సజ్జా పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

సీఎం పర్యటన ఏర్పాట్లు వేగవంతం చేయండి

జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి



బాపట్ల: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన ఏర్పాట్లను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి ఏప్రిల్ 1వ తేదీన ముఖ్యమంత్రి పర్యటించనున్న చిన్నగంజాం మండలం కొత్తగొల్లపాలెం గ్రామంలో జరుగుతున్న ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రేపు సాయంత్రంలోగా ముఖ్యమంత్రి హెలిప్యాడ్ పనులను పూర్తి చేయాలని ఆర్ అండ్‌బీ ఇంజినీర్లకు చెప్పారు. ముఖ్యమంత్రి పాల్గొనే సభావేదిక వద్ద బారికేడ్లను ఏర్పాటు చేయాలని చెప్పారు. ముఖ్యమంత్రి పాల్గొనే ప్రజావేదికను సిద్ధం చేయాలని అధికారులకు చెప్పారు. ప్రజావేదికను సౌకర్య వంతంగా తయారు చేయాలని అన్నారు. ముఖ్యమంత్రి సభకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని చెప్పారు. ముఖ్యమంత్రి, ప్రజాప్రతినిధుల కోసం గ్రీన్ రూమ్‌లను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ప్రజావేదిక వద్ద 2వేల మంది కూర్చునే విధంగా సిటింగ్ ఏర్పాటు చేయాలని చెప్పారు. పేదల సేవలో పెన్షన్ల పంపిణీ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలని జిల్లారెవెన్యూ అధికారికి చెప్పారు. అధికారులకు అప్పగించిన బాధ్యతలను పూర్తిస్థాయిలో చేపట్టాలని ఆయన సూచించారు.

ఇసుక నిల్వల పెంపుపై చర్యలు తీసుకోవాలి

బాపట్ల: రాబోవు వర్షా కాలం దృష్ట్యా ఇసుక రీచ్‌లలో నిల్వల పెంపుపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం ఇసుక రీచ్‌లో ఉన్న ఇసుక నిల్వలపై గనుల శాఖ అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. గాజులంక-1, జువ్వలపాలెం రీచ్‌ల నుంచి ఇసుక తవ్వకాలకు ఇచ్చిన అనుమతులు ముగిసినందున వాటిని రెన్యువల్ చేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. గాజులంక-1 రీచ్‌లో 50శాతం వరకు ఇసుక తవ్వకాలు చేయడమైనదని, జువ్వలపాలెంలో ఎటువంటి తవ్వకాలు జరగలేదని అన్నారు. ప్రస్తుతం గాజులంక-2 రీచ్‌లో 40 వేల టన్నులు ఇసుక నిల్వలు మాత్రమే ఉన్నాయని తెలిపారు. జూన్ 15 నుంచి అక్టోబర్ మాసం వరకు వర్షాకాలం కారణంగా రీచ్‌ల నుంచి ఇసుక తవ్వకాలు నిలుపుదల చేయడం జరుగుతుందని తెలిపారు. వర్షాకాలంలో ఇసుక కొరత లేకుండా జిల్లాలో ఇసుక డిమాండ్ మేరకు ముందుగా మే నెలాఖరు నాటికి ఇసుక నిల్వ చేయాలని అధికారులకు సూచించారు. ఓలేరు రీచ్ నుంచి అన్ని అనుమతులు ఉన్నందున ఇసుక తవ్వకాలకు చర్యలు తీసుకోవాలని గనుల శాఖ అధికారిని కలెక్టర్ ఆదేశించారు. ఓలేరు రీచ్‌లో 74 వేల టన్నుల ఇసుక అందుబాటులో ఉన్నదని తెలిపారు. ఎట్టి పరిస్థితులలో వర్షాకాలంలో ఇసుక కొరత లేకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. ఇసుకను జిల్లా అవసరాలకు మాత్రమే వాడుకోవాలని, ఇతర జిల్లాలకు తరలించకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అధికారులు ఆదేశించారు. గాజులంక -1, జువ్వలపాలెం రీచ్‌ల రెన్యువల్ కోసం సంబంధిత అధికారులతో చర్చించి అనుమతులు పొందాలని అన్నారు. సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్, మైన్స్ ఏడీ రాజేష్‌బాబు, జిల్లా రవాణా అధికారి పరంధామరెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ అనంతరాజు, రేపల్లె ఆర్డీఓ రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పర్చూరులో విజిలెన్స్ అధికారుల దాడులు

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం స్వాధీనం



విజిలెన్స్ అధికారులు పట్టుకున్న రేషన్ బియ్యం మినిలారీ

పర్చూరు(చినగంజాం): పర్చూరులో విజిలెన్స్ అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించారు. అక్రమంగా తరలిస్తున్న 90 బస్తాల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. విజిలెన్స్ సీఐ చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. ముందస్తు సమాచారంతో జిల్లా విజిలెన్స్ ఎస్పీ సూర్య శ్రవణ్‌కుమార్ ఆదేశాల మేరకు పర్చూరు వై జంక్షన్ వద్ద నిఘా పెట్టారు. కారంచేడు నుంచి చిలకలూరిపేట వైపు మినీ లారీ వెళుతుండగా ఆపి తనిఖీలు నిర్వహించారు. రేషన్ బియ్యాన్ని రీసైక్లింగ్ చేసేందుకు నరసరావుపేట తరలిస్తున్నట్లు చెప్పడంతో స్వాధీనం చేసుకున్నారు. బియ్యం ఎక్కడి నుంచి సేకరించారనే సమాచారం తెలియాల్సి ఉందని సీఐ తెలిపారు. మినీ లారీతో సహా డ్రైవర్‌ని కూడా అదుపులోనికి తీసుకొని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. దాడులలో జిల్లా పౌరసరఫరాల శాఖాధికారులు, స్థానిక రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

మద్యంపై నారీ సమరభేరీ



పేటేరులో మద్యం దుకాణం వద్దంటూ మహిళల ఆందోళన

- ఇళ్ల మధ్య మద్యం దుకాణాల ఏర్పాటు
- వ్యతిరేకిస్తున్న ప్రజలు
- పట్టించుకోని ఎక్సైజ్ అధికారులు

రేపల్లెరూరల్: ఇటీవల కల్లుగీత కార్మికులకు మద్యం దుకాణాలు కేటాయిస్తు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రేపల్లె పట్టణం, మండలం, నగరం మండలాలలో ఒకొక్క షాపు ఏర్పాటుకు అనుమతులు లభించాయి. లైసెన్స్‌లు పొందిన నిర్వాహకులు కూటమి నేతల అండదండలతో నిబంధనలకు విరుద్ధంగా షాపులు ఏర్పాటుకు ప్రయత్నాలు ప్రారంభించారు. పలు గ్రామాలలో నిబంధనలకు తిలోదకాలు ఇచ్చి మద్యం దుకాణాలు ఏర్పాటుచేస్తున్నారు. దీంతో విద్యార్థులు, మహిళలు, గ్రామస్తులు స్వచ్ఛందంగా రహదారులపైకి వచ్చి ఉద్యమిస్తున్నారు. మద్యం దుకాణాల నిర్వాహకులు, కూటమి పెద్దలు తలలు పట్టుకుంటున్నారు.

నిబంధనలు ఇలా...

- జాతీయ రహదారికి 200 మీటర్ల దూరంలో, బడి, గుడికి 100 మీటర్ల దూరం వరకు ఏర్పాటు చేయరాదు.
- నివాస గృహాల మధ్య ఏర్పాటు చేయరాదు.

పేటేరులో మహిళల ఆందోళన

రేపల్లె మండలం అరవపల్లి గ్రామంలో ఏర్పాటు చేద్దామనుకున్న మద్యం దుకాణంపై గ్రామస్తుల నుంచి వ్యతిరేకత రావటంతో పేటేరు గ్రామంలో నెలకొల్పేందుకు నిర్వాహకులు పూనుకున్నారు. పేటేరు గ్రామంలో బడికి, గుడికి సమీపంలో మద్యం దుకాణం నెలకొల్పేందుకు నిర్వాహకుడు ఏర్పాట్లు ప్రారంభించాడు. మహిళలు, విద్యార్థుల నుంచి తీవ్ర వ్యతిరేకత రావటంతో దుకాణాల యజమానులు దుకాణం ఏర్పాటు సందిగ్ధం నెలకొంది.

రేపల్లె పట్టణంలో నిబంధనలకు నీళ్లు

రేపల్లె పట్టణం ఓల్డ్‌టౌన్‌లో ప్రధాన రహదారికి పక్కనే, గుడికి, బడికి 100 మీటర్ల దూరంలో మద్యం దుకాణాన్ని ఏర్పాటు చేశారు. స్థానిక ప్రజల నుంచే కాక పలువురు మద్యం షాపుల వ్యాపారుల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తుతుండటంతో మద్యం షాపును వేరే ప్రాంతానికి తరలించే పనిలో నిర్వాహకులు ఉన్నారు.

బడి దగ్గర మద్యం దుకాణాలేంటి?



మద్యం వ్యాపారాలు ప్రజలకు ఇబ్బందులు లేని ప్రదేశాలలోనే చేసుకోవాలి. బడి, గుడి సమీపంలో దుకాణాలు నెలకొల్పితే సహించేదిలేదు.

– సీహెచ్ మణిలాల్

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



ప్రభుత్వ నిబంధనలను తప్పని సరిగా పాటించాలి. ఓల్డ్‌టౌన్‌లోని మద్యం దుకాణం వారం రోజుల్లో ఆ ప్రాంతంలో నుంచి తొలగిస్తాం. పేటేరులో వేరే ప్రాంతంలో దుకాణాన్ని ఏర్పాటు చేసుకోవాలని నిర్వాహకులకు సూచించాం.

– దివాకర్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ, రేపల్లె

కష్టాల్లో జీడిపప్పు వ్యాపారం

- దేవరపల్లి నుంచి తక్కువ ధరకే దిగుమతి
- వేటపాలెం జీడిపప్పుకు తగ్గిన డిమాండ్
- మూతబడుతున్న దుకాణాలు
- ఆందోళనలో వ్యాపారులు



వేటపాలెంలోని జీడి పప్పు ఫ్యాక్టరీ

వేటపాలెం: వేటపాలెంలో దొరికే జీడిపప్పుకు మంచి డిమాండ్. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పనులపై చీరాల వచ్చిన వారు ఇక్కడి జీడిపప్పు కొనుగోలుచేసి తీసుకుని వెళుతుంటారు. అంతేగాక రాష్ట్రంలోని పలు ప్రాంతాలతోపాటు విదేశాలకు ఎగుమతి చేస్తుంటారు. కానీ ప్రస్తుతం వేటపాలెం జీడిపప్పు వ్యాపారం తీవ్ర పోటీని ఎదుర్కొంటుంది. దేవరపల్లి నుంచి వచ్చే జీడిపప్పు వేటపాలెం మార్కెట్‌ను ముంచెత్తుతుంది. దేవరపల్లి నుంచి తక్కువ ధరకు లభిస్తుండడంతో కొనుగోలుదారులతోపాటు వ్యాపారులు అటువైపే మొగ్గు చూపుతున్నారు. దీంతో వేటపాలెం నుంచి సరఫరా అయ్యే జీడిపప్పుకు డిమాండ్ తగ్గింది. ఇప్పటికే వేటపాలెంలో ఐదు జీడిపప్పు దుకాణాలు మూతపడ్డాయి. మరికొన్ని అదేబాటలో ఉన్నాయి.

80 ఏళ్ల ప్రస్థానం

వేటపాలెంలో 80 ఏళ్లుగా జీడిపప్పు తయారవుతుంది. ఇక్కడ నుంచి దేశంలోని ఇతర ప్రాంతాలకు, ఇతర దేశాలకూ ఎగుమతి అవుతుంటుంది. మొదట్లో నాలుగు ఫ్యాక్టరీలు ఉండేవి. ప్రస్తుతం 20 ఫ్యాక్టరీలు వరకు ఉన్నాయి. రాజమండ్రి, తుని, దేవరపల్లి ప్రాంతాల నుంచి జీడి గింజలు కొనుగోలు చేసి తీసుకు వచ్చి ఇక్కడ ఫ్యాక్టరీల్లో జీడిపప్పుగా మార్చి ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేస్తుంటారు. వేటపాలెం ప్రాంతంలోని జీడి పప్పు ఫ్యాక్టరీల్లో పని చేస్తూ రెండు వేల మంది ఉపాధి పొందుతున్నారు. జీడి పప్పు ఫ్యాక్టరీలు మూతపడే పరిస్థితి రావడంతో కూలీలు ఆందోళన చెందుతున్నారు.

దేవరపల్లిలో విస్తారంగా జీడితోటలు

దేవరపల్లి సమీపంలోని అటవీ ప్రాంతంలో జీడితోటలు విస్తారంగా ఉంటాయి. దీంతో చుట్టు పక్కల ప్రాంతాల్లో జీడి పప్పు ఫ్యాక్టరీలు పుట్టగొడుగుల్లా వెలిశాయి. సమీప ప్రాంతాల ప్రజలు తోటల నుంచి జీడి గింజలు సొంతంగా సేకరించుకొని తక్కువ ధరకు ఫ్యాక్టరీలకు అమ్ముతుంటారు. వాటిని కాల్చి ముడి జీడిపప్పుగా మార్చి విక్రయిస్తుంటారు. కిలో ముడి జీడిపప్పు దేవరపల్లి ప్రాంతంలో ప్రస్తుతం రూ.700లకు లభిస్తుంది. దీంతో చిన్నచిన్న వ్యాపారులు జీడిపప్పు వ్యాపారం చేయటం మొదలుపెట్టారు. ఎటువంటి పన్నులు లేకపోవడంతో వీరు విజయవాడ వంటి ముఖ్యమైన పట్టణాలకు చిన్నచిన్న గోతాల్లో కట్టి సరఫరా చేస్తుంటారు. తక్కువ ధరకే దేవరపల్లి జీడిపప్పు లభిస్తుండడంతో వ్యాపారులు అటువైపే మొగ్గుచూపుతున్నారు. దీంతో వేటపాలెం ప్రాంతంలో తయారవుతున్న జీడిపప్పుకు డిమాండ్ పడిపోయిందని వ్యాపారస్తులు ఆందోళన చెందుతున్నారు.

ధరల్లో వ్యత్యాసం

వేటపాలెంలో జీడి పప్పు జంబో రకం గుళ్ల రూ.1100, అమెరికన్ గుళ్ల రూ.900, బద్ద రూ.900, ముక్క అరగుళ్ల రూ.780 ముక్క రూ.770 ధరలు ప్రస్తుతం ఉన్నాయి. దేవరపల్లిలో ప్రతి రకానికి ఇక్కడ ఉన్న ధరల్లో రూ.100 నుంచి రూ.200 వ్యత్యాసం ఉంటుందని వ్యాపారులు తెలిపారు.

ఆందోళనలో వేటపాలెం వ్యాపారులు

ఇదే పరిస్థితి కొనసాగితే రాబోయే కాలంలో వేటపాలెం ప్రాంతంతో జీడి పప్పు ఫ్యాక్టరీలు చాలావరకు మూత పడే అవకాశం ఉందని వ్యాపారస్తులు ఆందోళన చెందుతున్నారు.



ఆరబోసిన జీడి గింజలు

కూలి ఖర్చులు తక్కువ

దేవరపల్లిలో కిలో పప్పు గింజల నుంచి వేరు చేసినందుకు కూలీలకు రూ.20 ఇస్తారు. అదే వేటపాలెంలో రూ.31 ఇస్తారు. కిలోకి రూ.11 వ్యత్యాసం ఉంది. దేవరపల్లిలో ఇతర ఖర్చులు కూడా తక్కువగా ఉండడంతోపాటు ఎలాంటి పన్నులు లేకపోవడంతో మార్కెట్‌లో తక్కువ ధరకే జీడిపప్పు లభ్యమవుతుంది.

రూ.62.64 కోట్ల అంచనాలతో బడ్జెట్ ఆమోదం

అభివృద్ధి పనులకు అధిక కేటాయింపు



మున్సిపల్ బడ్జెట్ సమావేశాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

చీరాల: చీరాల మున్సిపాలిటీ బడ్జెట్ 2025-26 సంవత్సరానికిగాను రూ.62.64కోట్ల అంచనాలతో ఆమోదం జరిగింది. శుక్రవారం మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు అధ్యక్షతన బడ్జెట్ సమావేశాన్ని నిర్వహించారు. 2024-25 ముగింపు నిల్వ రూ.15.87కోట్లును 2025-26 ప్రారంభ నిల్వగా చూపారు. రూ.62.64 కోట్లు జమలు అవుతాయని అంచనాలు వేశారు. ప్రారంభ నిల్వతో కలుపుకుని రూ.78.51 కోట్లు కాగా, ఖర్చులు రూ.62.03 కోట్లు అవుతాయని అంచనా వేశారు. ముగింపు నిల్వ 2025-26గాను రూ.16.48 కోట్లు చూపారు. మున్సిపల్ ఆదాయం ఆస్తి పన్ను రూ.13.47 కోట్లు, ఖాళీ స్థలాల పన్ను రూ.38.77 కోట్లు, స్టాంప్ డ్యూటీ సర్‌ఛార్జీలు రూ.20.03 కోట్లు మొత్తం రూ.22.80 కోట్లు అంచనాలుగా చూపారు. వివిధ గ్రాంటుల క్రింద, ప్రభుత్వం నుంచి వచ్చే నిధులు రూ.38.84 కోట్లుగా చూపారు. ఇందులో డ్రెయిన్లకు రూ.26.58 కోట్లు, రోడ్లుకు రూ.1.70 కోట్లు, ఇతర మౌళిక వసతులకుగాను రూ.41.63 కోట్లుగా అంచనాలు వేశారు. రూ.39.84 కోట్లు అభివృద్ధి పనులకు కేటాయించగా జీతభత్యాలు, కార్యాలయ ఖర్చులకు మిగిలిన బడ్జెట్‌ను కేటాయించారు. ఈ బడ్జెట్‌ను కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది. అలానే కౌన్సిలర్ బత్తుల అనిల్‌కుమార్ హిందూ శ్మశానవాటిక అభివృద్ధికి మరికొంత నిధులు కేటాయించాలన్నారు. శ్మశానవాటికలో ఎలక్ట్రికల్ మిషన్ ఏర్పాటు చేయాలన్నారు. మరో కౌన్సిలర్ గుంటూరు ప్రభాకరరావు మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యశాలలో కోటి రూపాయలతో నిర్మించిన ఆక్సిజన్ యూనిట్ నిర్వహణలో లేదని, నిధులు కేటాయించి ఆక్సిజన్ యూనిట్‌ను అభివృద్ధి చేయాలన్నారు.

అందరి సహకారంతో చీరాల అభివృద్ధి

–ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య

ఎక్స్‌అఫిషియో సభ్యుడి హోదాలో పాల్గొన్న ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య మాట్లాడుతూ రాజకీయాలకతీతంగా అందరూ చీరాల అభివృద్ధికి పాటుపడాలన్నారు. అందుకు తాను ముందుంటానన్నారు. చీరాల ప్రాంతంలో క్రిటికల్ కేర్ యూనిట్ కోసం కేంద్ర ప్రభుత్వం రూ.23.70 కోట్లు కేటాయించిందన్నారు. కుందేరు అభివృద్ధికి రూ.89 కోట్లు మంజూరయ్యాయని, కుందేరులో ఆక్రమణలు తొలగించి మంచి పిక్నిక్ పాయింట్‌గా ఏర్పాటు చేస్తామన్నారు. పాండురంగాపురం నుంచి వాడరేవు వరకు సముద్ర సమీపంలో రోడ్డు నిర్మాణ జరగనుందన్నారు. శ్మశానవాటికలో అధికంగా వసూలు చేస్తే చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. పన్నులు చెల్లించని ప్రభుత్వ కార్యాలయాలపై చర్యలు తీసుకోవాలన్నారు.

క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ జెండా తొలగింపునకు కుట్ర

అధికారులకు గన్నవరం ఎస్సీ కాలనీ వాసుల వినతి

యద్దనపూడి: దశాబ్దకాలంగా తమ కాలనీలో ఉన్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండాను తొలగించటం కోసం గ్రామంలో జరుగుతున్న కుట్రను అడ్డుకోవాలంటూ యద్దనపూడి మండలం గన్నవరం ఎస్సీ కాలనీవాసులు శుక్రవారం అధికారులకు విజ్ఞప్తి చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. గన్నవరం ఎస్సీ కాలనీవాసులు 10 సంవత్సరాల క్రితం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండాను శాశ్వతంగా ఏర్పాటు చేసుకొని అవసరమైన సందర్భాలలో పలు కార్యక్రమాలు నిర్వహించుకుంటున్నారు. ప్రస్తుతం వైఎస్సార్ సీపీ జెండాను శాశ్వతంగా తొలగించి ఇతర అవసరాల కోసం ఆ స్థలాన్ని వినియోగించాలని కొందరు ప్రయత్నిస్తున్నారు. దీని వలన గ్రామంలో శాంతిభద్రతల సమస్య తలెత్తే అవకాశం ఉందని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ జెండాను యథాస్థితిలో కొనసాగించి సమస్యలు పెరగకుండా చూడాలని వారు కోరారు. ఈ మేరకు వారు యద్దనపూడి ఎస్ఐ రత్నకుమారి, ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శులకు వినతిపత్రం అందజేశారు.

రేపు జిల్లా హాకీ టీం క్రీడాకారుల ఎంపిక

బాపట్ల రాష్ట్ర 15వ జూనియర్ పురుషుల అంతర్ జిల్లాల హాకీ చాంపియన్‌షిప్ బాపట్ల జిల్లా క్రీడాకారుల టీం ఎంపిక ఆదివారం బాపట్ల మండలం చెరువు జమ్ములపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్లు జిల్లా హాకీ అసోసియేషన్ కార్యదర్శి బి.వీరచంద్ర శుక్రవారం విలేకరులకు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఏప్రిల్ 6 నుంచి 9వ తేదీ వరకు ధర్మవరంలో జరుగనున్న రాష్ట్రస్థాయి స్థాయి హాకీ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఎంపికకు హాజరయ్యే క్రీడాకారులు 2006 జనవరి 1లోపు జన్మించిన వారై ఉండాలి. ఆధార్, పుట్టిన తేదీ ధృవీకరణ, పాస్‌పోర్టు, పాఠశాల నమోదు పత్రం తప్పనిసరిగా తీసుకు రావాలని తెలిపారు. హాకీ సామగ్రి సొంత స్టిక్, షిన్ గార్డ్‌లు, ఇతర సురక్షిత ఉపకరణాలు తెచ్చుకోవాలన్నారు. క్రీడాకారులు సమయానికి హాజరు కావాలన్నారు. మరింత సమాచారం తెలుసుకునేందుకు సెల్ : 9704669060కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చన్నారు.

పీహెచ్‌సీని సందర్శించిన కేంద్ర బృందం

పెదకూరపాడు: మండలంలోని 75 త్యాళ్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం కేంద్ర బృందం సందర్శించింది. డాక్టర్ ఏఎన్ పరిమళ జగన్, డాక్టర్ భద్రకాంత్ శర్మల ఆధ్వర్యంలో సభ్యులు ఎన్‌క్యూఏఎస్ (జాతీయ నాణ్యత హామీ ప్రమాణాలు)లో భాగంగా వైద్యశాలలో సేవలను పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం వైద్య సిబ్బందితో మాట్లాడుతూ నాణ్యమైన సేవలపై దృష్టి పెట్టాలన్నారు.

పాఠశాలకు పూర్వ వైభవం దక్కేనా!

- వేలాదిమందిని తీర్చిదిద్దిన వైఎన్‌ఓ ఉన్నత పాఠశాల
- ప్రభుత్వానికి అప్పగించినా నోచుకోని పునఃప్రారంభం
- అవస్థలు పడుతున్న గ్రామానికి చెందిన విద్యార్థులు
- ఈ ఏడాదిలో అయినా ప్రారంభించాలని కోరుతున్న గ్రామస్తులు



కారంచేడులో వైఎన్‌ఓ ఉన్నత పాఠశాల

కారంచేడు: ఎంతో మంది సినీ, రాజకీయ ప్రముఖులకు పుట్టినిల్లు కారంచేడు. గ్రామం నుంచి వెళ్లి అనేక మంది దేశ విదేశాలలో స్థిరపడ్డారు. అటువంటి గ్రామంలో ప్రస్తుతం ఉన్నత పాఠశాల లేకపోవడం గమనార్హం. ఒకప్పుడు వేలాది మంది విద్యార్థులకు ఉచిత విద్యను అందించడమే కాకుండా, ఎంతో మంది ప్రముఖులను లోకానికి పరిచయం చేసిన యార్లగడ్డ నాయుడమ్మ ఓరియంటల్ (కం) ఉన్నత పాఠశాల నేడు బోసిపోతుంది. ఈ ఏడాదైనా ఇక్కడ ప్రభుత్వం ద్వారా ఉన్నత పాఠశాలను ప్రారంభిస్తారని గ్రామస్తులు ఎదురుచూస్తున్నారు.

నీరుగారుతున్న దాతల ఆయం

కారంచేడు కాలువ సెంటర్ ప్రాంతంలో వాడరేవు-పిడుగురాళ్ల జాతీయ ప్రధాన రహదారికి ఆనుకొని సుమారు ఎకరం పైగా ఉన్న భూమిలో గ్రామానికి చెందిన విద్యాదాతలు అన్నదమ్ములైన యార్లగడ్డ వెంకన్నచౌదరి, యార్లగడ్డ రంగనాయకులు 1956వ సంవత్సరంలో గ్రామస్తులకు ఉచిత విద్యను అందించాలనే సంకల్పంతో పాఠశాలను ప్రారంభించారు. ఈ పాఠశాలను చల్లపల్లి రాజా ప్రారంభించారు. అనంతరం నిర్మించిన పక్కా భవనాలను 1963లో సినీనటుడు అక్కినేని నాగేశ్వరరావు ప్రారంభించారు. అవిభక్త పిల్లల వైద్యునిగా ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన డాక్టర్ యార్లగడ్డ నాయుడమ్మ, సినీనటుడు ఎన్టీ రామారావు అల్లుడు, రాష్ట్ర మంత్రిగా పనిచేసిన దగ్గుబాటి వెంకటేశ్వరరావులు ఇదే పాఠశాలలో విద్యనభ్యసించారు. 2022వ సంవత్సరంలో అప్పటి ప్రభుత్వ నిబంధనల మేరకు పాఠశాలకు చెందిన స్థలం, 12 గదులతో కూడిన భవన సముదాయం ప్రభుత్వానికి అప్పగించేలా పాఠశాల కరస్పాండెంట్ యార్లగడ్డ రఘుబాబు అప్పటి విద్యాశాఖ మంత్రి, విద్యాశాఖ కమిషనర్‌కు సమ్మతి తెలిపారు. ఈలోగా ప్రభుత్వం మారడంతోపాటు, ఈ ఏడాది జనవరి 6వ తేదీన డిప్యూటీ విద్యాశాఖ అధికారి, స్థానిక ఎంఈఓ, తహసీల్దార్ సమక్షంలో అంగీకార పత్రాలను, సంబంధిత అన్ని రకాల పత్రాలను అందించారు. పాఠశాలకు చెందిన అన్ని పత్రాలను ప్రభుత్వానికి అప్పగించిన రోజునే గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థి కన్నెగంటి నాగేశ్వరరావు పాఠశాల అభివృద్ధికి రూ.లక్ష విరాళంగా అందించారు.

ప్రారంభంకాని తరగతులు

యార్లగడ్డ నాయుడమ్మ ఓరిఎంటల్ (కం) ఉన్నత పాఠశాలను ప్రభుత్వ ఉన్నత పాఠశాలగా మార్చి 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఇంగ్లీషు మీడియంతో పునఃప్రారంభిస్తామని అధికారులు అప్పట్లో చెప్పారు. జూన్ నెలలో పాఠశాల పునఃప్రారంభం కావాల్సి ఉండగా నేటికీ ఆ దిశగా తీసుకున్న చర్యలు శూన్యం. గ్రామంలోని పాఠశాలను మూసివేయడంతో గ్రామానికి చెందిన విద్యార్థులు కుంకలమర్రు, స్వర్ణ, చీరాల, పర్చూరు ప్రాంతాలకు వెళుతున్నారు. విద్యాశాఖ అధికారులు ఇప్పటికైనా స్పందించి ఈ ఏడాది గ్రామంలో పాఠశాలను పునః ప్రారంభించాలని తల్లిదండ్రులు, విద్యార్థులు కోరుతున్నారు.

ప్రభుత్వానికి అప్పగించాం

మా పూర్వీకుల నుంచి నడుపుతున్న యార్లగడ్డ నాయుడమ్మ ఓరియంటల్ ఉన్నత పాఠశాలకు సంబంధించిన భవనాలు, స్థలం ప్రభుత్వానికి అప్పగించాం. యార్లగడ్డ నాయుడమ్మ ప్రభుత్వ ఉన్నత పాఠశాలగా ప్రారంభిస్తామని అధికారులు చెప్పారు. కానీ ప్రారంభం కాలేదు. ఈ ఏడాదైనా ప్రారంభించేలా చర్యలు తీసుకుంటారని భావిస్తున్నాం.

–యార్లగడ్డ రఘుబాబు, పాఠశాల కరస్పాండెంట్

ఈ ఏడాది ప్రారంభిస్తాం..

కారంచేడు గ్రామంలో ఉన్నత పాఠశాలను ప్రారంభించేలా ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలున్నాయి. ఈ ఏడాది పాఠశాలను ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నాం. ఈ ఏడాది తరగతుల వారీగా ఎంత మంది విద్యార్థుల అడ్మిషన్లు జరుగుతాయో పరిశీలిస్తున్నాం. జాబితా సిద్ధం అయిన వెంటనే పాఠశాలకు యూడైస్ కోడ్‌ను కేటాయించి సిబ్బంది నియామకాలు కూడా చేపడతాం.

–గంగాధర్, ఉప విద్యాశాఖ అధికారి, చీరాల

కుంకలమర్రు వెళ్తున్నాం



గ్రామంలో హైస్కూల్ లేకపోవడం వలన బస్సు, ఆటోల్లో ప్రయాణించి కుంకలమర్రు గ్రామానికి వెళ్తున్నాం. ప్రతి రోజూ ప్రయాణించాలంటే ఇబ్బందిగా ఉంటుంది. ప్రత్యేక తరగతుల కోసం సమయం కేటాంచలేకపోతున్నాం. కారంచేడులో ఈ సంవత్సరం ప్రారంభిస్తారని చెబుతున్నారు. మా ఊర్లోనే ఉంటే మాకు అనుకూలంగా ఉంటుంది.

–బాజీ, విద్యార్థి, కారంచేడు

మా గ్రామంలో ఉంటే బాగుండేది



1వ తరగతి నుంచి కారంచేడులోనే చదువుకున్నా. హైస్కూల్ చదువులకు వచ్చేసరికి కుంకలమర్రు వెళ్లాల్సి వస్తుంది. ప్రయాణం ఇబ్బందిగా ఉంటుంది. స్కూల్ సమయానికి బస్సు అందుబాటులో లేకపోయినా ఇబ్బందిగా ఉంటుంది. ఉన్నతాధికారులు స్పందించి మా సమస్యను పరిష్కరించాలి.

–కల్పన, విద్యార్థి, కారంచేడు

వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగ కమిటీ ఎంపిక

బాపట్ల: వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లాకు చెందిన పలువురికి రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీలో నియమిస్తూ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. స్టేట్‌బూత్ కమిటీ వింగ్ జనరల్ సెక్రటరీగా దేవరపల్లి నాగ వెంకటకుమార్, స్టేట్ వీవర్స్ వింగ్ జాయింట్ సెక్రటరీగా పి.సుబ్బయ్యను నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

బాలుడి హత్య కేసులో నిందితుడికి యావజ్జీవ శిక్ష

ముప్పాళ్ల: బాలుడి హత్య కేసులో నిందితుడికి కోర్టు యావజ్జీవ కారాగార శిక్ష విధించినట్లు ముప్పాళ్ల ఎస్సై వి.సోమేశ్వరరావు శుక్రవారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. 2021లో ముప్పాళ్లకు చెందిన పఠాన్ మహమ్మద్ అఫ్రిది (16)ని చంపుతానని షేక్ పెద్దబాజీ బెదిరించాడు. తన తమ్ముడు కుమారుడిని చెడగొడుతున్నాడని అతడు భావించడమే దీనికి కారణం. ఈ క్రమంలో అఫ్రిది రోడ్డుపై వెళుతుండగా పెద్దబాజీ కత్తితో దాడిచేసి చంపేశాడు. అప్పటి ఎస్సై ఎం.పట్టాభిరామయ్య కేసు నమోదు చేశారు. అప్పటి సత్తెనపల్లి రూరల్ సీఐ బి.నరసింహారావు చార్జిషీట్ వేయగా, గుంటూరు ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ కోర్టులో విచారణ ప్రారంభమైంది. సత్తెనపల్లి డీఎస్పీ ఎం.హనుమంతరావు ఆధ్వర్యంలో ప్రస్తుత సత్తెనపల్లి రూరల్ సీఐ ఎం.వి.సుబ్బారావు సూచనల మేరకు ప్రస్తుత ఎస్సై వి.సోమేశ్వరరావు, సెషన్స్ కోర్టు కానిస్టేబుల్ షేక్ సైదాలు సంబంధిత సాక్షులను కోర్టులో ప్రవేశపెడుతూ కేసు దర్యాప్తును వేగవంతం చేశారు. విచారణ అనంతరం గుంటూరు ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి కోర్టు న్యాయమూర్తి వైవీఎస్‌బీజీ పార్థసారథి... నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్షతోపాటు రూ.10వేల జరిమానా విధించారు. ఫిర్యాది తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ సుల్తాన్ సిరాజుద్దీన్ వాదనలు వినిపించారు.

వివాహిత హత్య కేసులో ఇద్దరు అరెస్టు



కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ నాగేశ్వరరావు

వినుకొండ: విలాసాలకు అలవాటుపడి దొంగతనాలు చేయడం.. ఇందులో భాగంగా ఒంటరి మహిళలను లక్ష్యంగా చేసుకోవడం.. ఎవరైనా ఎదురు తిరిగితే హత్య చేయడం.. ఇదీ ఆ ఇద్దరి నైజం. వివాహిత హత్యకేసులో నిందితులైన వారిని శుక్రవారం పోలీసులు అరెస్ట్ చేశారు. వినుకొండ పట్టణంలో సంచలనంగా మారిన కొప్పరపు సావిత్రి హత్య కేసును పోలీసులు ఛేదించారు. స్థానిక పట్టణ పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ నాగేశ్వరరావు, సీఐ శోభన్ బాబు, సిబ్బంది కలిసి ఆ నిందితులను మీడియా ముందు హాజరుపరిచారు. డీఎస్పీ మాట్లాడుతూ... ఈ నెల 17వ తేదీన పట్టణంలోని కొత్తపేట ప్రధాన వీధిలో కొప్పరపు సావిత్రి హత్యకు గురైందన్నారు. వినుకొండ రూరల్ మండలం పెదకంచర్ల గ్రామానికి చెందిన కట్టెంపూడి సాంబయ్య, ఆవుల మంగమ్మ కలిసి దొంగతనాలకు పాల్పడుతున్నట్లు, అదే క్రమంలో మధ్యాహ్న సమయంలో సావిత్రిని హత్య చేసినట్లు విచారణలో తేలిందన్నారు. సాంబయ్య ఆటో నడుపుతుంటాడని, మంగమ్మ ఇళ్లల్లో పనులు చేస్తుందని తెలిపారు. వీరికి వివాహేతర సంబంధం ఉందని చెప్పారు.

గొంతుకు చీర బిగించి హత్య

ఇంట్లో ఒంటరిగా ఉన్న సావిత్రి వద్దకు ఘటన జరిగిన రోజు మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఇద్దరు వెళ్లి హత్య చేసినట్లు విచారణలో తేలిందన్నారు. సావిత్రి చేతులను సాంబయ్య పట్టుకోగా, మంగమ్మ చీరను సావిత్రి మెడకు బిగించడంతో ఊపిరి ఆడక మృతి చెందిందని తెలిపారు. అనంతరం సావిత్రి మెడలోని బంగారపు గొలుసు, రెండు ఉంగరాలను దుండగులు కాజేశారని పేర్కొన్నారు. బంగారు ఉంగరం, రూ.1.30 లక్షల నగదును నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. నిందితులను కోర్టులో హాజరు పరచనున్నట్లు డీఎస్పీ తెలిపారు.

జీఎస్టీ కమిషనర్ సాధు నరసింహారెడ్డికి సత్కారం



లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): మూడు దశాబ్దాలుగా విశిష్ట వ్యక్తులకు, కళాకారులకు పురస్కారాలు అందజేస్తున్న గుంటూరులోని ప్రముఖ సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ ఈవీవీ యువ కళావాహిని ఈ ఏడాది ఉగాది పురస్కారాన్ని కస్టమ్స్, సెంట్రల్ ట్యాక్స్ కమిషనర్ సాధు నరసింహారెడ్డి (ఐఆర్‌ఎస్)కి అందజేసింది. శుక్రవారం బ్రాడీపేట లోని ఒక హోటల్లో జరిగిన కార్యక్రమంలో కళావాహిని అధ్యక్షుడు కృష్ణమూర్తి, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు ఏల్చూరి వెంకటేశ్వర్లు చేతుల మీదుగా కమిషనర్ నరసింహారెడ్డిని ఉగాది విశిష్ట సేవా పురస్కారంతో సత్కరించారు. నరసింహారెడ్డి మాట్లాడుతూ ఈ పురస్కారం తన బాధ్యతను మరింత పెంచిందని చెప్పారు. చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు ఏల్చూరి వెంకటేశ్వర్లు మాట్లాడారు.

పొగాకు రైతులను ఆదుకునేందుకు చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న నల్లమడ రైతు సంఘం నాయకులు కొల్లా, చిత్రంలో జేసీ ప్రఖర్‌జైన్

బాపట్ల: పొగాకు రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతు సంఘం నాయకులు కోరారు. ఐటీసీ, జీపీఐ, అలియన్స్ తదితర పొగాకు కంపెనీల ప్రతినిధులు, నల్లమడ రైతు సంఘం నాయకులతో బాపట్ల జిల్లా జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్ శుక్రవారం సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో నల్లమడ రైతు సంఘం నాయకులు డాక్టర్ కొల్లా రాజమోహన్ మాట్లాడుతూ నిరుడు బర్లీ పొగాకుకి తప్ప ఏ పంటకీ ఆదాయం రాలేదని, కంపెనీల ఫీల్డ్ స్టాఫ్ కూడా ధర వస్తుందని, పండించమని ప్రోత్సహించడం వల్ల ఎక్కువగా బర్లీ పొగాకు వేశారని చెప్పారు. ఇప్పుడు కంపెనీలు కొనకపోవటంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారని, ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. రైతులు మాట్లాడుతూ కంపెనీలు బర్లీ పొగాకు కొనుగోలు వెంటనే ప్రారంభించాలని, పోయిన సంవత్సరం ధరలకే కొనుగోలు చేయాలని కోరారు. కంపెనీ ప్రతినిధులు త్వరలో కంపెనీలన్నీ సమావేశమై కొనుగోలు తేదీ ప్రకటిస్తామన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి రామకృష్ణారావు కంపెనీ ప్రతినిధులు రైతుల్ని ప్రోత్సహించడం మా దృష్టికి కూడా వచ్చిందన్నారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ వీలైనంత త్వరలో కొనుగోలు ప్రారంభించమని కంపెనీల యాజమాన్యాలని కోరారు. తర్వాత రైతులతో మాట్లాడుతూ రైతులకి మద్దతుగా వుంటామని, రైతులు యితర పంటలపై కూడా దృష్టి పెట్టాలని కోరారు. కారుమంచి విజయకుమార్, ఆం.ప్ర.రైతు సంఘం నాయకులు రామకృష్ణ, జి.గంగయ్య, రైతులు పాలేటి వీరయ్య, గోవాడ సత్యనారాయణ, దాసరి రామకృష్ణ, యినగంటి బాబు, నాగేశ్వరరావు, కారుమూడి వెంకట్రావు, బుర్రా సుబ్రహ్మణ్యం, దొప్పలపూడి హరిబాబు, నాయుడు సుబ్బారావు, ఎ.ప్రభుదాస్, బచ్చు రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

చిరు ధాన్యాలు ఆరోగ్యానికి మేలు



మాట్లాడుతున్న బాపట్ల ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ మురళీధర్ నాయక్

కర్లపాలెం: చిరు ధాన్యాలు ఆరోగ్యానికి మేలు చేస్తాయని బాపట్ల ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్ ఆర్ మురళీధర్ నాయక్ చెప్పారు. పేరలి రైతు సేవా కేంద్రంలో చిరుధాన్యాల సాగుపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మురళీధర్ నాయక్ మాట్లాడుతూ రైతులు చిరు ధాన్యాల సాగు చేపట్టాలని చిరు ధాన్యాలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందని తెలిపారు. ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త ఎం.ఉష మాట్లాడుతూ రాగులతో అనేక రకాలైన పదార్థాలు తయారు చేసుకోవచ్చునని చెప్పారు. రాగులతో తయారుచేసిన పదార్థాలు తీసుకోవడం వల్ల ఆరోగ్యానికి ఎంతో ప్రయోజనం చేకూరుతుందని అన్నారు. చిరుధాన్యాలలో అనేక రకాల పోషకాలు ఉన్నాయని అన్నారు. చిరుధాన్యాల వినియోగం పెరుగుతుందని చెప్పారు. చిరుధాన్యాల సాగును అందరూ ప్రోత్సహించాలని ఆమె కోరారు. చిరుధాన్యాల సాగు పెరిగిందని అన్నారు. కార్యక్రమంలో బాపట్ల ఏడీఏ లక్ష్మి, ఏవో సుమంత్‌కుమార్, ఏఈవో ధనలక్ష్మి, గ్రామ వ్యవసాయ సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

చీరాలలో భారీ చోరీ

సుమారు 15 సవర్లు బంగారం ఆభరణాలు చోరీ



ఇంటిలో వస్తువులను పరిశీలిస్తున్న పోలీసులు, క్లూస్‌టీం

చీరాల: చీరాల పట్టణం విఠల్‌నగర్‌లోని ఓ ఇంటిలో భారీ చోరీ జరిగింది. ఈ సంఘటన శుక్రవారం వెలుగు చూడగా సుమారు 15 సవర్ల బంగారం చోరీకి గురైనట్లు పోలీసులు అంచనా వేశారు. వివరాల్లోకి వెళితే... చీరాల పట్టణం విఠల్‌నగర్‌కు చెందిన తిరుమలశెట్టి రజని అనే మహిళ ఇంటిలో ఒంటరిగా నివసిస్తుంది. పదిరోజుల కిందట బెంగుళూరులోని కుమారుడి వద్దకు వెళ్లింది. ఇంటిలో ఎవరూ లేకపోవడంతో పసిగట్టిన దుండగులు చోరీకి పాల్పడ్డారు. శుక్రవారం ఉదయం ఇంటి పనిమనిషి తలుపులు పగలకొట్టి ఉండడం చూసి పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ఒన్‌టౌన్ పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఇంటిలోని వస్తువులు చిందరవందరగా పడివేయగా క్లూస్‌టీం సిబ్బంది ఇంటిలోని వస్తువులపై వేలిముద్రల కోసం పరిశీలన చేశారు. ఇంటిలో ఉంచిన బంగారం చోరీకి గురైందని, సుమారు 15 సవర్లు వరకు బంగారం ఉంటుందని ఆమె ఫోన్‌లో తెలిపింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పంటలు ఎండిపోకుండా సాగునీరివ్వాలి

- రైతు, కౌలు రైతు సంఘాలు డిమాండ్
- ఎన్‌ఎస్‌పీ ఎస్‌ఈ కార్యాలయం వద్ద నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు, రైతులు

నరసరావుపేట: పంటలు ఎండిపోకుండా సాగునీరు అందించాలని ఏపీ రైతు సంఘం పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏపూరి గోపాలరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం పట్టణం బీసీ కాలనీలోని ఎన్‌ఎస్‌పీ ఎస్‌ఈ కార్యాలయం వద్ద మిర్చి, వరి, మొక్కజొన్న రైతులతో కలిసి సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం ఎస్‌ఈ పి.కృష్ణ మోహన్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గోపాలరావు మాట్లాడుతూ... రైతు ప్రభుత్వమని చెప్పే పాలకులు రబీలో సాగు చేసిన పంటలు చేతికి అందాలంటే కచ్చితంగా ఏప్రిల్ ఆఖరు వరకు సాగు నీరు ఇవ్వాల్సిందే అన్నారు. పెట్టుబడి సాయం విషయంలో రైతులను మోసగించిన ప్రభుత్వం సాగు నీరు విషయంలోనూ మోసానికి పాల్పడుతోందని తెలిపారు. ప్రస్తుతం డెడ్ స్టోరేజీ కంటే అదనంగా నీటి లభ్యత ఉందన్నారు. కౌలు రైతు సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు కామినేని రామారావు మాట్లాడుతూ.. మండలాలవారీగా పంటలు ఎంత విస్తీర్ణంలో సాగు చేశారో గుర్తించి తగిన నీరు ఇవ్వాలన్నారు. రైతు సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు గుంటుపల్లి బాలకృష్ణ, వివిధ సంఘాల నాయకులు జి.పిచ్చారావు, ఆవుల ఆంజనేయులు, వెంకటేశ్వర్లు, బి.నాగేశ్వరరావు, ఈపూరి అప్పిరెడ్డి, క్రోసూరు, సత్తెనపల్లి, ముప్పాళ్ళ, నరసరావుపేట మండలాల రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

జాతీయ జట్టుకు శిక్షణ పూర్తి

జె.పంగులూరు: ఈ నెల 31 నుంచి ఏప్రిల్ 4 వరకు ఒడిశా రాష్ట్రంలోని పూరి పట్టణంలో 57వ జాతీయ స్థాయి స్త్రీ, పురుషుల పోటీలు జరగనుంది. ఈ పోటీలలో పాల్గొనే రాష్ట్ర జట్టుకు 10 రోజుల నుంచి స్థానిక మాగుంట సుబ్బరామిరెడ్డి, బాచిన నారాయణమ్మ జూనియర్ కళాశాలలోని క్రీడా ప్రాంగణంలో రాష్ట్ర ఖోఖో అసోసియేషన్, పంగులూరు గ్రామస్తుల సహకారంతో, ఎస్ఆర్ఆర్ ఖోఖో అకాడమీ ఆధ్వర్యంలో జట్టుకు శిక్షణ జరిగింది. శుక్రవారం రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ కార్యదర్శి మేకల సీతారామిరెడ్డి అధ్యక్షతన జరిగిన శిక్షణ ముగింపు కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా తహసీల్దార్ సింగరావు హాజరయ్యారు. ఆయన క్రీడాకారులను పరిచయం చేసుకొని, పోటీలలో మంచిగా రాణించి రాష్ట్రానికి పతకం తీసుకురావాలని ఆశించారు. మేకల జయరామిరెడ్డి జ్ఞాపకార్థం వారి కుమారుడు మేకల సీతారామిరెడ్డి, ఉషారాణి క్రీడాకారులకు క్రీడాదుస్తులు పంపిణీచేశారు.